క్లుప్తంగా

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు.

గజవాహనంపై ఊరేగిన స్వామివారు


గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

యాదమరి: ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామివారి గజవాహనంపై ఊరేగారు. స్వామివారి కల్యాణం అనంతరం స్వామివారు శనివారం రాత్రి గజవాహనంపై పుర వీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

కంటి పరీక్షలకు 83 మంది ఎంపిక

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడివీధిలో ఆదివారం జైన్‌సంఘ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్వీ అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులు 158 మందికి పరీక్షలు చేశారు. ఇందులో ఎంపికైన 83 మందికి ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు.

గాలీవానతో విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలో ఆదివారం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.


గిరింపేటలో ఒరిగిన విద్యుత్ స్తంభం

పిడుగుపడి కొబ్బరి చెట్టు దగ్ధం


కాలిపోతున్న కొబ్బరి చెట్టు

ఐరాల: మండలంలోని వినాయకపురంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు బలంగా వీచాయి. చిన్నపాటి వర్షం కురిసింది. ఉరుములకు గోవర్ధన్‌రెడ్డి ఇంటి పక్కన ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడి చెట్టు పూర్తిగా కాలిపోయింది. ఈ దృశ్యాన్ని కొందరూ వీడియోలో చిత్రీకరించారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం : మండలంలోని శ్రీరంగరాజపురం సచివాలయ పరిధిలోని నాయుడుపల్లి, సీకే పురం, పాతపాళెంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి

వృద్ధులకు దుస్తుల వితరణ

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని 32 మంది వృద్ధులకు ఆదివారం పుత్తూరు పట్టణానికి చెందిన వెంకటరామయ్య తన భార్య వర్ధంతి సందర్భంగా చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అలాగే బీరువా వితరణ చేశారు. అనంతరం దాత వెంకటరామయ్య మాట్లాడుతూ వృద్ధులకు చేయూతనివ్వడం ఆనందంగా ఉంటుందన్నారు. ఏటా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం తనకు ఇష్టమన్నారు. అలాగే మధ్యాహ్నం అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బాబు, జయచంద్ర, మురళి, భీమారావు, గుర్రప్ప, సాంబయ్య, సోమశేఖర్, వెంకటేష్, ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.


దుస్తులు అందజేస్తున్న వెంకటరామయ్య


ఆస్పత్రిలోని జనరేటర్ ప్లాంట్


అత్యవసర విభాగ ముఖద్వారం

బుడ్డీ దీపం.. గుడ్డి వైద్యం

- జిల్లా ఆస్పత్రిలో కరెంటు కష్టాలు
- జనరేటర్ ఉన్నా వెలగని లైట్లు
- అధికారుల్లో స్పందన కరువు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలకు కరెంట్ అడ్డుపడుతోంది. ఎక్కడైనా కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోవడం సాధారణం. ఇక్కడ కరెంట్ లేకపోవడంతో రోగులు మృత్యువాత పడుతుండడం గమనార్హం. విద్యుత్ అంతరాయం ఉన్నప్పుడు ఉపయోగించుకోవడానికి జనరేటర్ అందుబాటులో ఉంది. అయితే ఆస్పత్రిలోని ప్రధాన విభాగాల్లోని లైట్లను ఆ జనరేటర్‌తో అనుసంధానం చేయకపోవడం దౌర్భాగ్యం. తాజాగా బుడ్డీ దీపాలు, సెల్‌ఫోన్ టార్చిలైట్ల వెలుతురులో క్షతగాత్రులకు చికిత్స చేయడం శోచనీయం.

చిత్తూరు రూరల్: జిల్లా కేంద్రం నడిబొడ్డున ప్రభుత్వ ఆస్పత్రి ఉంది. చుట్టు పక్కల ఏ ప్రమాదం జరిగినా అత్యవసర చికిత్స కోసం క్షతగాత్రులను ఇక్కడికి తరలిస్తుంటారు. ఇలా రోజూ రోడ్డు ప్రమాదాలకు సంబంధించి 10 నుంచి 15 కేసులు వస్తుంటాయి. అత్యవసర చికిత్స కోసం 100 నుంచి 150 వరకు ఓపీలు నమోదవుతుంటాయి. అయితే అప్పుడప్పుడు ఆస్పత్రిలో కొన్ని కారణాల వల్ల కరెంటు సరఫరా నిలిచిపోతుంది. ఇలాంటప్పుడు అవసరమవుతుందని యూపీఎస్, జనరేటర్‌ను అందుబాటులో ఉంచారు. అయితే వాటిని వినియోగించుకోవడం ఆస్పత్రి అధికారులకు చేతకాకపోవడం విడ్డూరం.

అందుబాటులో జనరేటర్

కరెంటు కోత సమయాల్లో ఆస్పత్రిలోని అన్ని విభాగాలకు విద్యుత్ సరఫరా చేసే సామర్థ్యం గల జనరేటర్లు ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. రెండు 160 కేవీఏ, 200 కేవీఏ, 40 కేవీఐ, 50 కేవీఏలు ఒకటి చొప్పున అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు ఓపీడీ బ్లాక్‌లో 80 కేవీఏ, పాత ఐపీ బ్లాక్ 40 కేవీఏ, కొత్త ఐపీ బ్లాక్‌లో 60కేవీఏ, ఎంఆర్ఐ బ్లాక్‌లో 12 కేవీఐ యూపీఎస్‌లు వాడకంలో ఉన్నాయి. ఇవి సామర్థ్యాన్ని బట్టి కొన్ని గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. ఎక్కువ సమయం పాటు కరెంటు కోత పడితే తప్పకుండా జనరేటర్ అవసరమవుతోంది. ఇలాంటప్పుడు జనరేటర్ నిర్వహణలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. కరెంటు పది నిమిషాల్లో వచ్చేస్తుందని ఆస్పత్రి నిర్వాహకులు జనరేటర్ ఆన్ చేయకుండా కాలం వెళ్లదీయడం అత్యంత దుర్మార్గం. 160 కేవీఏ జనరేటర్‌ను నడపాలంటే 50 నుంచి 60 లీటర్ల డీజిల్, 200 కేవీఏకు 30 నుంచి 40 లీటర్ల డీజిల్ అవసరమవుతోందని, అందుకే జనరేటర్ వాడకంలో కాస్త ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

తాజా ఘటనలో..

వరిగపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికులు ఇద్దరు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తీసుకువచ్చిన సమయంలో పవర్ కట్ అయింది. యూపీఎస్ కొంత సేపటి వరకు మాత్రమే వెలుగునిచ్చింది. ఆ తర్వాత డాక్టర్లు మొబైల్ ఫోన్‌లోని లైట్‌ల వెలుగులో క్షతగాత్రులకు చికిత్స అందించాల్సి వచ్చింది. ఆ బుడ్డీ దీపాల వెలుగులోనే గాయాలకు కుట్లువేయడం గమనార్హం. ఆ తరువాత విధిలేక వేలూరు సీఎంసీకి రెఫర్‌చేశారు.

ఆస్పత్రిలో చీకటి కష్టాలు

విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు, నిర్వహణ కోసం శనివారాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తుంటారు. వర్షాల సమయంలో కరెంటు తీగలపై చెట్లు వాడడం, ఫ్యూజులు కాలిపోవడం వంటి జరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో మాత్రమే ఆస్పత్రిలో కరెంటు కష్టాలొస్తున్నాయి. ఈతరుణంలో ఆస్పత్రి అన్ని విభాగాల్లో జనరేటర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంలేదు. అసలు పలువిభాగాలకు ఈ జనరేటర్ నుంచి కనెక్షన్ ఇవ్వలేదని సిబ్బంది చెబుతున్నారు.

ఈదురుగాలుల వల్లే..



ఈదురు గాలులు వల్లే శనివారం కరెంటు సరఫరాలో అంతరాయం వచ్చింది. అప్పటికే సిబ్బంది సంఘటన స్థలికి పంపించి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకున్నాం. అదే ఫీడర్‌లోనే జనరేటర్ కనెక్షన్ ఉంది. అందువల్లే శనివారం కరెంటు సమస్య ఎదురైంది. ఇకపై అలాంటివి జరగకుండా ముందు జాగ్రత్త పడుతాం. మిలిగిన విభాగాలను పరిశీలించి ఇబ్బంది లేకుండా చూస్తాం.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


వేరుశనగ విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని వసంతాపురం రైతుభరోసా కేంద్రం ఆవరణలో ఆదివారం ఆయన రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు 30 కిలోల వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై రూ.1,676కే అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయాధికారి మాధవి మాట్లాడుతూ మండలానికి 1020 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం అందిస్తుందని ఇప్పటివరకు 470 క్వింటాళ్లు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, రెడ్డెప్ప, రజనీకాంత్, శిలంబరసన్, వాణి, రాకేష్, మణి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి రూ.2.25 లక్షల విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి గుంటూరుకు చెందిన దాత రావిపాటి సాయికృష్ణ రూ.2.25లక్షలు విరాళంగా అందించారు. ఆదివారం దాత కుటుంబ సభ్యులు నిత్య అన్నదానంకు రూ.1లక్ష, గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.25లక్షలు విరాళంగా ఆలయ అధికారులకు అందించారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


విరాళాలను ఆలయ అధికారులకు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణోత్సవం



పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు, ద్రౌపదీదేవి కల్యాణోత్సవం

తవణంపల్లె: మండలంలోని కాణిపాకం పట్నంలో జరుగుతున్న మహా భారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం ద్రౌపదీ దేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు సిద్ధంపల్లె హరిరెడ్డి కుటుంబసభ్యులు అమ్మవారి కల్యాణోత్సవానికి పూజా సామగ్రి, సారె, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఆలయంలో అర్చకులు ధర్మరాజు విగ్రహానికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీ దేవి, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. తర్వాత అర్చకులు అమ్మవారి కల్యాణాన్ని వేదమంత్రాలు పఠనం చేస్తూ సంప్రదాయబద్ధంగా చేశారు. అమ్మవారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారి కల్యాణోత్సవంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు గురుకువారిపల్లె ప్రకాష్‌రెడ్డి, గాంధీబాబు, సురేష్ బాబురెడ్డి, రమణారెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, పరమేశ్వర రెడ్డి, సుకేష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, మధుకుమార్, మోహన్‌రెడ్డి, వేణుగోపాల్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవరదుని ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ



ఆలయంలో సుగంధ పుష్పాల అలంకరణ, అన్నదానం చేస్తున్న యూత్ సభ్యులు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుని ఆలయంలో ఉభయదారులు సుగంధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి రథోత్సవం సందర్భంగా ఆదివారం యాదమరికి చెందిన లేట్ ఏకాంబరం శెట్టి కుమారులు ఆలయంలో సుగంధ పుష్పాలతో అలంకరించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు గ్రామస్తులు, అయ్యప్పస్వామి భక్తబృందం, యూత్ సభ్యులు అన్నదానం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.

వేడుకగా అర్జున తపస్సు

గుడిపాల: వసంతాపురం వద్ద ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయం వద్ద ఆదివారం అర్జున తపస్సు వేడుకగా నిర్వహించారు. నిర్వాహకులు తపస్మానుకు పూజలు చేసి తీసుకువచ్చారు. నంతరం అర్జున వేషధా మెట్టు మెట్టుకు ఒక్కోపాటి పాడుతూ తపస్సు మానుపైకి ఎక్కారు. పైనుంచి పూజ వస్తువులను కిందికి జారవిడిచారు. వాటిని అందుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం వసంతాపురం యూత్ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


తపస్సుమాను ఎక్కిన అర్జున వేషధారి

మండల అభివృద్ధికి కృషి

పూతలపట్టు: మండల అభివృద్ధి కోసం రాష్ట్ర అటవీ విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకురాలు గౌహతి సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో చేపట్టే అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, తేజేశ్వర్ రెడ్డి, గుణేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీకి ఉద్యోగోన్నతి


సుశీల

పూతలపట్టు: మండల ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న సుశీలకు ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లాలో ఎంపీడీఓగా కేటాయించినట్లు అందులో పేర్కొంది.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

బంగారుపాళెం: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావుకు శత జయంతి సందర్భంగా ఆదివారం ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ఆ పార్టీ శ్రేణులు అన్నదానం చేశారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌తోపాటు నాయకులు జయచంద్ర నాయుడు, ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

శత జయంతి వేడుకలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఆదివారం టీడీపీ నాయకులు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు నిర్వహించారు. టీడీపీ కార్యాలయం, నగపాలక సంస్థ కార్యాలయం తదితరచోట్ల ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆపార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ (41), ఆదిలక్ష్మి (32) శనివారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వరిగపల్లి సమీపంలో బెంగళూరు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ సగిలి షణ్మోహన్ స్పందించారు. ఆయన ఆదేశాలతో మెరుగైన వైద్య సేవ కోసం తమిళనాడులోని రాణిపేట సీఎంసీకి తరలించారు. అక్కడి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ధ్యానం


ప్రసంగిస్తున్న పిరమిడ్ మాస్టర్ విశ్వప్రసాద్

తవణంపల్లె: సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందమయ జీవితం గడపడానికి ప్రతి ఒక్కరు ధ్యానం చేయాలని తిరుపతికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ విశ్వప్రసాద్ ధ్యానులకు హితబోధ చేశారు. మండలంలోని సిద్దంపల్లె సమీపం శ్రీ విఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ తనని గురించి తాను తెలుసుకోవడమే ధ్యానమని అన్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ బాలాజీ ప్రసంగిస్తూ గీతా ధ్యాన ప్రవచనాలను అద్భుతంగా అందించారు. గీతా సారాంశాన్ని సవివరంగా వివరించారు. పిరమిడ్ మాస్టర్లు విశ్వప్రసాద్, బాలాజీని జిల్లా పిరమిడ్ స్పిరిచువల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

అలరించిన దుర్యోధన వధ


మట్టితో తీర్చిన దుర్యోధనుడి ప్రతిమ



గుడిపాల: కమ్మతిమ్మాపల్లెలో నిర్వహించనున్న మహాభారతయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. దుర్యోధనుడి ప్రతిమను బంకమట్టితో తయారుచేసి దుర్యోధన, భీముడు పాత్రధారులు ఆలపించిన పద్యాలు, అభినయం అలరించాయి. అనంతరం బంకమట్టి కోసం జనం ఎగబడ్డారు. సాయంత్రం చేపట్టిన అమ్మవారి అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

చిత్తూరులో గాలీవాన


ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

చిత్తూరు రూరల్: నగరంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన బలమైన వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ చెట్లు నేలవాలాయి. మామిడి కాయలు రాలిపోయాయి. రోడ్లంతా జలమయంగా మారింది. మండలంలో ఐదు గంటలపైగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

నేడు వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ

చిత్తూరు కార్పొరేషన్: పేదల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు మాటలకు నిరసనగా సోమవారం నగరంలో వైఎస్సార్‌సీపీ బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ర్యాలీ స్థానిక గాంధీ విగ్రహం నుంచి బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

గుడిపాల: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పేదలకు ఇస్తున్న ఇంటి పట్టాలపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జనార్ధన్ తెలిపారు. సోమవారం ఉదయం 8:30 గంటలకు చీలాపల్లె పెట్రోల్‌బంక్ నుంచి బైక్‌ర్యాలీ ప్రారంభమై చిత్తూరులోని గాంధీవిగ్రహం వరకు కొనసాగుతుందని చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని వారు తెలియజేశారు.

డీఎస్పీకి జాతర నిర్వాహకుల సన్మానం

చిత్తూరు అర్బన్: నడివీధి గంగజాతర కమిటీ సభ్యులు డీఎస్పీ శ్రీనివాసమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీ కార్యాలయంలో ఆయన్ను కలిసి సభ్యులు దుశ్శాలువలతో సన్మానించారు. జాతర ప్రశాంతంగా జరగడానికి పోలీసుశాఖ ముఖ్యకారణమని కృతజ్ఞతలు తెలిపారు. కొత్తవిధానాలను అవలంబించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జాతర ప్రశాంతంగా ముగిసిందని వారు కొనియాడారు.


డీఎస్పీని సన్మానిస్తున్న జాతర నిర్వాహకులు

ముత్యాలమ్మకు పొంగళ్లు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

గుడిపాల: మండలంలోని కుప్పిగానిపల్లె గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ, కనికలమ్మ వార్లకు గ్రామస్తులు పూజలు చేసి పొంగళ్లు పెట్టారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పురవీధుల్లో పొంగళ్లు తీసుకొని బాణసంచా వేడుకలు, వేద పండితుల మధ్య అమ్మవార్లకు పూజలను నిర్వహించారు. ఆదివారం రాత్రి గంగమ్మకు చాటింపు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం గరిగె ఊరేగింపు, మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.


విద్యుత్ దీపాలంకరణలో కుప్పిగానిపల్లె